టవర్ల నిర్మాణంతో రైతులకు తీవ్ర నష్టం

- అన్నదాతలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- న్యాయం చేయాలని వినతి



కలెక్టర్ జి.లక్ష్మీశకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రైతులు(ఫైల్)



కంద్రిక పొలాల్లోని విద్యుత్ టవర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారం చేపట్టాక, కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. ముందస్తు సమాచారం ఇవ్వకుండా రైతుల వ్యవసాయ భూముల్లో ఇష్టమొచ్చినట్టు విద్యుత్ టవర్లను నిర్మించడంతో విలేజి కంద్రికలోని రైతాంగం నష్టపోతున్నారు. గొల్లపూడి - అవుటుపల్లి వరకు నేషనల్ హైవే నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ టవర్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కాంట్రాక్ట్ సంస్థలు రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అలైన్‌మెంట్ ప్రకారం టవర్లను నిర్మిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. పంట నష్టంతో పాటు విద్యుత్ టవర్ల నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా రైతులు నష్టపోతున్నారు. నష్టపోతున్న తమకు నష్టపరిహారం చెల్లించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రైతులు వాపోతున్నారు.

అధికారులకు వినతి పత్రాల అందజేత..

విజయవాడ నగరపాలకసంస్థలో ఉన్న వ్యవసాయ భూములకు కూడా ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ఉన్న విధంగా నష్టపోయిన ప్రాంతానికి 10 శాతం మాత్రమే నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. ఎకరం 5 కోట్ల రూపాయల నుంచి 7 కోట్ల రూపాయల వరకు ఉన్న ఎంతో విలువైన రైతుల భూములను కాంట్రాక్ట్ సంస్థలు రెవెన్యూ అధికారులు, పోలీసుల అండదండలతో ఆక్రమించుకొని టవర్లు నిర్మాణాలు జరిపిస్తున్నాయి. రైతులు తమ పంట పొలాలను నాశనం చేయవద్దని చెబుతున్నా కాంట్రాక్ట్ సంస్థలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సమస్యలను రెవెన్యూ అధికారులకు చెప్పాలని కసురుకొంటున్నారని చెప్పారు. గట్టిగా అడిగిన రైతులను మీ చేతనైంది చేసుకోండని దౌర్జన్యం చేస్తున్నారు. భూములు, పంటలను కోల్పోయిన రైతులు అనేక దఫాలు మండల తహసీల్దారు, సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్‌లను సైతం కలిసి వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, కనీసం విలువలో 30 శాతం నష్టపరిహారం చెల్లించాలని పదే పదే అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 64వ డివిజన్ విలేజి కంద్రికకు చెందిన రైతులు విద్యుత్ టవర్ల నిర్మాణం వలన పంటలు, వ్యవసాయ భూములు కోల్పోయి నష్టపోయారు. విద్యుత్ టవర్ల నిర్మాణం వలన నష్టపోయిన రైతులకు 30 శాతం నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు రైతులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశను ఇటీవల ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

30 శాతం పరిహారం ఇవ్వాలి..



విద్యుత్ టవర్ల నిర్మాణం వలన విలేజి కంద్రిక రైతులతో పాటు నున్న, పాతపాడు, అంబాపురం, జక్కంపూడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులందరికీ 30 శాతం చొప్పున ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి.

–మూలగొళ్ల రవీంద్ర రెడ్డి, కంద్రిక సొసైటీ మాజీ చైర్మన్

ప్రభుత్వం ఆదుకోవాలి..



కంద్రికలో ఉన్న మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమిలో విద్యుత్ టవర్లు నిర్మిచారు. విద్యుత్ టవర్లు వేసిన పొలంలో ఎలాంటి కట్టడాలు నిర్మించుకునే అవకాశం లేదు. తీగలు వెళ్లిన ప్రాంతాల్లో భవిష్యత్‌లోనూ నిర్మాణాలు చేపట్టాలేం. ఎంతో విలువైన భూములకు విద్యుత్ టవర్ల వలన తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– భీమిరెడ్డి సాంబిరెడ్డి, కంద్రిక రైతు

రవాణా మంత్రి, చైర్మన్‌ను కలిసిన ఏపీ పీటీడీ బీసీ నేతలు



ఆర్టీసీ చైర్మన్ నారాయణకు బొకే అందజేస్తున్న ఏపీ పీటీడీ బీసీ అసోసియేషన్ నేతలు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో నేతలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌ను, ఏపీ ఎస్ఆర్‌టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలను మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేసిన తర్వాత రద్దు చేసిన బీసీ ఉద్యోగుల గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించాల్సిందిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌కి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఈతాకుల కృష్ణ, టి.సూరిబాబు, వి.జానకిరాం, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా జరగాలి



లబ్బీపేటలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో వీఎంసీ నిర్వహణలో ఉన్న మరుగుదొడ్లన్ని సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా పటమట, బందర్ రోడ్డు, వారధి, నేషనల్ హైవే, లబ్బీపేట వాటర్ ట్యాంక్, ఆర్టీసీ లేబర్ కాలనీ, నైజాం గేట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. లబ్బీపేటలోని వాటర్ ట్యాంక్, గవర్నర్ పేటలో ఉన్న మరుగుదొడ్లను కమిషనర్ పరిశీలించి, అవన్నీ నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, వాటిలో నిరంతరం నీటి సరఫరా జరగాలని చెప్పారు. నగర పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ పర్యవేక్షిస్తూ చెత్త సేకరణ నిత్యం జరిగేటట్టు చూసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్ జ్యోతి యర్రాజీకి అభినందనల వెల్లువ



జ్యోతి యర్రాజీని అభినందిస్తున్న ఆకుల రాఘవేంద్రరావు, హైమ

విజయవాడస్పోర్ట్స్: జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని ప్రపంచం గర్వించదగ్గ అథ్లెట్‌గా రాణించి, భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతి యర్రాజీని క్రీడా లోకం ప్రశంసలతో ముంచెత్తుతోంది. తాజాగా కేంద్రం ప్రకటించిన అర్జున అవార్డుల జాబితాలో రాష్ట్ర క్రీడాకారిణి జ్యోతి యర్రాజీ పేరు ఉండటం పట్ల రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు సంతోషం వ్యక్తం వ్యక్తం చేస్తూ ఆమెను గురువారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని మొక్కవోని దీక్షతో అథ్లెట్‌గా రాణించిన జ్యోతి ప్రతిభను భారత అథ్లెటిక్ సమాఖ్య సంయుక్త కార్యదర్శి ఆకుల రాఘవేంద్రరావు, సమాఖ్య సభ్యురాలు, ఏపీ సంఘం మాజీ కార్యదర్శి హైమా అభినందనలు తెలిపారు. 100 మీటర్ల హార్డిల్స్‌ను 12.78 సెకన్లలో, 60 మీటర్ల హార్డిల్స్‌ను 8.12 సెకన్లలో పూర్తి చేసిన జాతీయ రికార్డును జ్యోతి సొంతం చేసుకుందని, 13 అతర్జాతీయ పతకాలు, 22 జాతీయ పతకాలు సాధించిందని గుర్తు చేశారు. ఆమె తండ్రి సూర్యానారాయణ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తుంటారని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో కఠినమైన శిక్షణ తీసుకుని ప్రపంచ అథ్లెట్‌గా రాణించిన ఆమె ఆశయాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

వీఎంసీలో నూతన సంవత్సర వేడుకలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, ఉద్యోగులు



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వీఎంసీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, మినిస్టరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు మేయర్ రాయన భాగ్యలక్ష్మిని, కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వీరి చాంబర్లలో పుష్ప గుచ్ఛాలు అందజేశారు.వీఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర హామీ ఇచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఈ సందర్భంగా ఎంప్లాయీస్ క్యాలెండర్‌ను కమిషనర్ ధ్యానచంద్ర ఆవిష్కరించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మిని, కమిషనర్ ధ్యానచంద్రను కలిసిన వారిలో వీఎంసీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు జి. అజయ్ కుమార్, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ ప్రభావతి, మినిస్టరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు దారా రాంబాబు, కార్యదర్శి ఎస్వీఎస్ చలం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, యూనియన్ ఉపాధ్యక్షులు టీవీఎస్ ఎస్ మురళీకృష్ణ, వరప్రసాద్, సహాయ కార్యదర్శి టి.ప్రతాప్ కుమార్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విభాగాధికారులు..

పట్టణ ప్రణాళిక విభాగం ప్రధాన అధికారి జీవీజీఎస్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ బోసు, ఏసీపీలు మోహన్‌బాబు, రాంబాబు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు వశీం బేగ్, గిరి పాల్గొన్నారు. సీఈ శ్రీధర్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సృజన ఆధ్వర్యంలో మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆకాంక్షించారు. స్థానిక 31వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పెనుమత్స సత్యం, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక సేవలు ఆదర్శనీయం



అప్పాజోస్యుల సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: అభో.విభో, కందాళం ఫౌండేషన్(అప్పాజోస్యుల, విష్ణుభొట్ల కందాళం) ద్వారా కళాసేవలను చేస్తున్న అప్పాజోస్యుల సత్యనారాయణ, డీఎస్ఎన్ మూర్తి సేవలు వెలకట్టలేనివని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. తెలుగు డ్రామా గ్రూప్, సంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కళారంగాలకు విశేష సేవలతో పాటు జాతీయ స్థాయిలో నాటికల పోటీలు నిర్వహిస్తున్న అప్పాజోస్యుల సత్యనారాయణ, డీఎస్ఎన్ మూర్తి సేవలను గుర్తు చేసుకుంటూ వారికి 80 సంవత్సరాలు నిండిన సందర్భంగా బందరు రోడ్డులోని మాకినేని బాలోత్సవ భవన్‌లో గురువారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుమ్మడి గోపాలకృష్ణ, నాటక రచయిత దర్శకుడు కందిమళ్ల సాంబశివరావు అప్పాజోస్యుల, డీఎస్ఎన్ మూర్తి సేవలను అభినందించారు. సత్కార కార్యక్రమంలో కళా విపంచి నిర్వాహకులు డి.రామకోటేశ్వరరావు, బొప్పన నరసింహరావు, కేవీ రామానుజాచార్యులు, నాటక రంగ ప్రముఖులు వైఎస్ కృష్ణేశ్వరరావు, డోగిపర్తి శంకరరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు అప్పాజోస్యులను, మూర్తిలను ఆత్మీయంగా సత్కరించారు. నాటక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



అలంకార్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని త్రీ టౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాల్లో 'కంపల్సరీ హెల్మెట్'పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకార్ సెంటర్‌లో నిర్వహించిన డ్రైవ్‌లో పెద్ద సంఖ్యలో హెల్మెట్ లేని వాహనదారులను గుర్తించి హెల్మెట్ వాడకం ఉపయోగాలు, ట్రాఫిక్ నిబంధనలపై కిషోర్‌బాబు అవగాహన కల్పించారు. పెండింగ్ చలానాల కోసం గూగుల్ క్రోమ్ ఓపెన్ చేసి 'ఈ చలాన్ పరివాహన' వెబ్‌సైట్ ద్వారా గాని లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్, మీ సేవ కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు.

విద్యా రంగాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది



మాట్లాడుతున్న నాసర్‌జీ, పక్కన నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ విమర్శించారు. హనుమాన్ పేటలోని దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలల యాజమాన్యాలు నిలిపి వేశాయన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ రూ.15 వేలు తల్లికి వందనం ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎగనామం పెట్టారన్నారు. అలాగే జీవో 77 రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, జిల్లా కార్యదర్శి కార్తీక్, నగర అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, రంజిత్, సురేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు తక్షణమే టిడ్కో ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదల సొంతింటి కల నెరవేరుస్తామని ఇళ్లు లేని పేద, మధ్యతరగతి వారికి గూడు కల్పిస్తామని ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం డిపాజిట్లు సేకరించి టిడ్కో ఇళ్లు కేటాయించలేదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల పేరుతో పేదల నుంచి రూ.25 వేలు రూ.50 వేలు, లక్ష రూపాయలు డిపాజిట్లు కట్టించుకున్నారన్నారు. డిపాజిట్ చెల్లించిన వారికి నేటికీ టిడ్కో ఇళ్లు కేటాయించలేదన్నారు. సొంతిళ్లు లేని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి తక్షణమే లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, కేవీ భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, అప్పరబోతు రాము, కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన గురువారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ గోదారంగనాథ స్వామివార్లకు బ్రహ్మీ ముహూర్తంతో పూజలు చేసి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పారాయణం చేశారు. కార్యక్రమాలను పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

గణపతి సచ్చిదానంద స్వామీజీ సేవలో మల్లాది విష్ణు



పటమట(విజయవాడతూర్పు): పటమటలోని జయ గురుదత్త గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమాన్ని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యుడు మల్లాది విష్ణు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన మీడియాతో.. మాట్లాడుతూ 2025 లో రాష్ట్రంలో అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని తెలిపారు.

నిరాడంబరుడు కామ్రేడ్ ఏబీ బర్ధన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్క్సిస్ట్ మేధావి, కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు ఏ.బి.బర్ధన్ నిరాడంబర జీవితం గడిపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ ఏబీ బర్ధన్ 9వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.రామకృష్ణ బర్ధన్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, లంక దుర్గారావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, కె.వి.భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, అప్పరబోతు రాము, కొట్టు రమణారావు, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట సుబ్బయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్, ఎం.సాయి కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్ పాల్గొన్నారు.

ఏబీఆర్ఎస్ఎం క్యాలెండర్ ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ఎస్ఎం) ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఏపీ కళాశాల విద్య సంచాలకులు డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ఆవిష్కరించారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్‌లో గురువారం రూ.42.32 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు కార్పొరేటర్ వీరమాచనేని లలిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.19.96 లక్షలతో పూనూరు సుబ్బారామిరెడ్డి నుంచి బీఆర్టీఎస్ రోడ్డు వరకు రోడ్డు మరమ్మతులు, రూ.14.40 లక్షలతో ధ్వంసమైన పాత పైపు లైన్ల స్థానంలో కొత్త వాటర్ పైపులైన్ పనులు, రూ.7.96 లక్షలతో రోడ్డు పేవర్ పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. డివిజన్‌లోని ఎస్ఎస్‌సీ బోస్ నగర్, సాయి బాబా గుడి రోడ్డులో జరుగుతున్న మురుగుకాల్వల శుభ్రం చేసే పనులను గురువారం ఆమె పరిశీలించారు. స్థానికులకు మురుగుకాల్వల ద్వారా ఎలాంటి సమస్య ఎదురుకాకుండా చూడాలని చెప్పారు. దోమలు అధికంగా ఉన్న చోట ఫాగింగ్ స్ప్రే చేయాలని శానిటర్ ఇన్‌స్పెక్టర్ గోపిరాజుకు సూచించారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందజేత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలోని శ్రీ కాజా సుబ్బారావు మాణిక్యాంబ ధర్మసత్రం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. సీవీఆర్ స్కూల్‌లో ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి అన్నపూర్ణ దేవస్థానం, సత్రం కార్యనిర్వాహణ అధికారి వై సీతారామయ్య మాట్లాడుతూ.. సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. అదనపు తరగతులకు హాజరై పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న మొత్తం 32 మంది విద్యార్థులకు ప్రతి రోజూ సాయంత్రం అల్పాహారం అందజేస్తామన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అల్పాహారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంలో వ్యాపారాలు చేయడం తగదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణం (అంబేడ్కర్ స్మృతివనం)లో ఎలాంటి వాణిజ్య వ్యాపారాలు జరగకుండా పర్యాటక ప్రాంతంగా, రీసెర్చ్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాంగణంలో ట్రైల్ బేస్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక డ్వాక్రా బజార్‌ను భవిష్యత్‌లో శాశ్వత వాణిజ్య సముదాయ నిర్మాణానికి అవసరమైన ప్రాతిపదిక నిర్వహణపరమైన లాభనష్టాల పేరుతో ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిసిందని, అది సరైన వైఖరి కాదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. కంద్రిక, జర్నలిస్ట్ కాలనీ, ఈడబ్ల్యూఎస్, ఎన్జీఓ, ఎల్ఐజీ కాలనీలు, రాజీవ్‌నగర్, విశాలాంధ్ర కాలనీ, రాధానగర్, ప్రజాశక్తినగర్, బర్మాకాలనీ, పాయకాపురం, పాకిస్తాన్ కాలనీ, ఏవీఎస్ రోడ్, ప్రకాష్‌నగర్, సుందరయ్య నగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీనగర్, ప్రశాంతి నగర్, శాంతినగర్, దేవినేని గాంధీ పురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలు



విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. ఎస్‌కేవీ సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని పాడుతాతీయగా పేరుతో సినీ సంగీత విభావరి, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ గాయనీ గాయకులకు సత్కార కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో గురువారం నిర్వహించారు. ఎస్‌కేవీ సంస్థ వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభల శ్రీనివాస్, ప్రసూనా రామన్, ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు. గాయనీ గాయకులు సుధారాణి, విష్ణుప్రియ, శ్రీనివాసరావు, జోషి, వడ్డాది కామేశ్వరి మహానటి సావిత్రి నటించిన చిత్ర గీతాలను ఆలపించారు. అనంతరం 2025 క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

రేపు మంత్రి లోకేష్ పాయకాపురం రాక

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 4వ తేదీ శనివారం పాయకాపురం, రాధానగర్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి రానున్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించేందుకు మంత్రి లోకేష్ వస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ కృతికశుక్లా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, స్థానిక ఎమ్మెల్యే, విప్ బొండా ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, సమగ్ర శిక్ష స్టేట్ పీడీ బి.శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొంటారని చెప్పారు.